

సాక్షి
పల్నాడు
శనివారం । 19 । అక్టోబర్ । 2024



64,312 క్యూసెక్కులు విడుదల

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 65,756 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 64,312 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 1516 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 40 క్యూసెక్కులు వదిలారు.



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి గుంటూరుకి చెందిన ఇనుకొల్లు సునీల్‌కుమార్, హారిక దంపతులు రూ. 1,11,111 అందజేశారు.

న్యూస్‌రీల్

22న గ్రహణమొర్రికి చికిత్స



నరసరావుపేట: చీలిక పెదవి, చీలిక అంగిలి (గ్రహణమొర్రి)లకు చికిత్స నిమిత్తం ఈనెల 22న మాచర్ల ప్రభుత్వాసుపత్రిలో నిర్వహించే ప్రత్యేక శస్త్రచికిత్స క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి కోరారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ క్యాంపునకు గ్రహణ మొర్రి ఉన్నవారు వచ్చి చెక్ చేయించుకోవాలని, శస్త్ర చికిత్స గురించి అవగాహన కలిగించి ఉచితంగా చేయిస్తారన్నారు. పిల్లలకు చీలిక పెదవిని సరి చేయడానికి ఒకటి లేదా రెండు శస్త్ర చికిత్సలు అవసరమౌతాయని చెప్పారు. ఇవి నరసరావుపేట పాత గవర్నమెంట్ హాస్పిటల్‌లోని డైక్ సెంటర్లో ఉచితంగా చేస్తారన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయిని మృతి



వినుకొండ(నూజెండ్ల): రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయినీ మృతిచెందిన సంఘటన వినుకొండ రూరల్ మండలం నాగులవరం సమీపంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా అద్దంకి పట్టణానికి చెందిన కొత్తమాస ధనలక్ష్మి (41) వినుకొండ రూరల్ మండలం గోకనకొండ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తుంది. విధుల్లో భాగంగా ఉదయాన్నే మరో ఉపాధ్యాయుడు ద్విచక్రవాహనంపై పాఠశాలకు వస్తుండగా నాగులవరం సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తూ బండిపై నుంచి జారిపడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలికి భర్త నాగేశ్వరరావు, ఒక బాబు ఉన్నాడు. వినుకొండ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సురేష్‌కు అబ్దుల్ కలాం నేషనల్ ప్రతిభా పురస్కారం



పిడుగురాళ్ల: డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ ప్రతిభా పురస్కారానికి విద్యార్థి కాలేజీ డైరెక్టర్ ఎం.సురేష్ ఎంపికై నట్లు ఎస్‌పీఎల్‌టీవో స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ నాగయ్య తెలియజేశారు. ఈనెల 20వ తేదీన గుంటూరులోని ఏసీ కళాశాల ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో సురేష్‌కు అవార్డును ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. అవార్డు రావటానికి ఎస్‌పీఎల్‌టీవో పల్నాడు జిల్లా ప్రెసిడెంట్ రాముకు ఎం.సురేష్ కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రప్రభ వాహనంపై నారసింహుడు



మంగళగిరి: పట్టణంలో శ్రీ లక్ష్మీనృసింహ స్వామి గ్రామోత్సవం గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. చంద్రప్రభ వాహనంపై శ్రీదేవి భూదేవి సమేతుడైన శ్రీవారిని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. టెంకాయలు కొట్టి నైవేద్యాలు అందజేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాన్ని ఆలయ ఈవో ఏ.రామకోటిరెడ్డి పర్యవేక్షించారు. ఉత్సవ కైంకర్యపరులు గంజి చిరంజీవి, గంజి రవీంద్రనాథ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇసుక సీనరేజీ ఆదాయాన్ని జెడ్పీకి జమ చేయాలి

– చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: జెడ్పీకి రావాల్సిన ఇసుక సీనరేజీ ఆదాయాన్ని సక్రమంగా జమ చేసేలా చూడాలని చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా తెలిపారు. జెడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం ఇసుక, భూగర్భ జలవనరుల సీనరేజీతో పాటు స్టాంప్ డ్యూటీ సర్‌చార్జీపై గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన ఆయా శాఖల అధికారులతో తన చాంబర్‌లో సమావేశమయ్యారు. గత రెండు ఆర్థిక సంవత్సరాలుగా ఇసుక, మినరల్స్, స్టాంప్ డ్యూటీ సర్‌చార్జీ నుంచి జెడ్పీకి రావడం లేదని, తక్షణమే నిధులు జమ చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారుల్ని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో వి. జ్యోతిబసు, డెప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ, ఆయా శాఖల అధికారులు, జెడ్పీ ఏవోలు పాల్గొన్నారు.



> రైతులకు అవసరమైన ఇన్‌పుట్స్ అందించడంతోపాటు ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించి వ్యవసాయాన్ని లాభాసాటిగా మార్చేందుకు గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్‌బీకేలను స్థాపించారు. ఈ మేరకు ఐదేళ్లపాటు ఆర్‌బీకేల ద్వారా సకాలంలో ఎరువులు, విత్తనాలను అందించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విత్తనాలు మొదలు ఎరువుల కోసం రైతులు తీవ్రంగా శ్రమించాల్సి వస్తుంది.

అన్నదాతకు ఎరువుల కష్టాలు

- యూరియా, డీఏపీ ఎరువులకు డిమాండ్
- బస్తాకు రూ.50నుంచి రూ.100 అధికంగా వసూలుచేస్తున్న వ్యాపారులు
- జిల్లాకు రూ.3.42లక్షల మెట్రిక్ టన్నులు అవసరం
- జిల్లాకు చేరింది రూ.1.32లక్షల మెట్రిక్ టన్నులే

నరసరావుపేట రూరల్: నాగార్జునసాగర్ కుడి కాలువ ఆయకట్టు పరిధిలో ఈ ఏడాది పంటల సాగు విస్తీర్ణం గతేడాది కన్నా పెరిగింది. కుడి కాలువ ద్వారా సాగుకు నీటి విడుదల చేయడంతో పాటు వర్షాలు సకాలంలో కురుస్తుండటంతో పంటల విస్తీర్ణం అధికంగా ఉంది. ఖరీఫ్‌లో సాధారణ విస్తీర్ణం 2,48,350 హెక్టార్లు కాగా సెప్టెంబర్ చివరికి ఖరీఫ్ ముగిసే నాటికి 1,73,497 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేశారు. రబీలో కూడా పెద్ద ఎత్తున పంటల సాగును చేపడుతున్నారు. ఈ నెలలోనే దాదాపు 10వేల ఎకరాల్లో వరిసాగు చేపట్టినట్లు అంచనా. మొక్కజొన్న సాగుకూ రైతులు సమాయత్తమవుతున్నారు.

తీవ్రంగా ఎరువుల కొరత...

మార్కెట్లో ఎరువులు అందుబాటులో లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా యూరియా, డీఏపీ ఎరువుల కొరత ఉంది. వరి సాగు చేస్తున్న రైతులతోపాటు మొక్కజొన్న సాగుకు సిద్ధమవుతున్న రైతులకు ఈ ఎరువుల అవసరం ఉంది. వరి నాటు సమయంలో డీఏపీకి వినియోగిస్తారు. అనంతరం రోజుల వ్యవధిలో యూరియాను పంటకు అందిస్తారు. మొక్కజొన్న సాగుకు ముందు దుక్కుల్లో డీఏపీ, యూరియాను కలిపి చల్లుతారు. ప్రస్తుతం ఆయా ఎరువులకు డిమాండ్ ఉంది. అయితే మార్కెట్లో వీటి లభ్యత తక్కువగా ఉండటంతో వ్యాపారులు వీటిని బ్లాక్ చేసి ఒక్కో బస్తాకు రూ.50 నుంచి రూ.100 అధిక ధరకు విక్రయిస్తున్నారు. యూరియా ధర రూ.266 ఉండగా రూ.330 నుంచి రూ.350లకు, డీఏపీ ధర రూ.1,355 ఉండగా రూ.1,450కి అమ్ముతున్నారు. దీంతోపాటు నానో యూరియా, కాంప్లెక్స్ ఎరువులు కొనుగోలు చేస్తేనే యూరియా, డీఏపీ ఎరువులను విక్రయిస్తామని వ్యాపారులు స్పష్టం చేస్తున్నారు.

జిల్లాకు 40 శాతం మేరకే సరఫరా..

ఈ ఏడాది జిల్లాకు 3,42,735 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం అవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. అయితే అక్టోబర్ నెల వరకు జిల్లాకు 1,32,119 మెట్రిక్ టన్నుల ఎరువులు మాత్రమే కంపెనీలు సరఫరా చేశాయి.

రిటైలర్స్ వద్దే ఎరువులు..

వ్యాపారులకు లాభాలు తీసుకువచ్చే విధంగా ప్రభుత్వ చర్యలు కనిపిస్తున్నాయి. మార్క్‌ఫెడ్, ఆర్‌ఎస్‌కేల ద్వారా ఎరువులను అందించాల్సిన ప్రభుత్వం వీటికి నామమాత్రంగా ఎరువులను సరఫరా చేస్తుంది. జిల్లాలో ప్రస్తుతం యూరియా 18,927 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉండగా రిటైలర్స్ వద్ద 12,748 మెట్రిక్ టన్నుల నిల్వలు ఉండగా హోల్‌సేల్ వ్యాపారుల వద్ద 4560 మెట్రిక్ టన్నులు, మార్క్‌ఫెడ్ వద్ద 496 మెట్రిక్ టన్నులు, ఆర్‌ఎస్‌కేల వద్ద 1123 మెట్రిక్ టన్నుల మాత్రమే ఉన్నాయి. డీఏపీ 6472 మెట్రిక్ టన్నులు ఉండగా, రిటైలర్స్ వద్ద 4220 మెట్రిక్‌టన్నులు, హోల్‌సెలర్స్ వద్ద 1006 మెట్రిక్ టన్నులు, ఏపీ మార్క్‌ఫెడ్ వద్ద 765 మెట్రిక్ టన్నులు, ఆర్‌ఎస్‌కేల వద్ద 427 మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నాయి. రిటైలర్స్ కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరకు విక్రయిస్తున్నారు. నరసరావుపేటతోపాటు సత్తెనపల్లి, చిలకలూరిపేట, వినుకొండ ప్రాంతాల్లో ఇదే విధంగా అధిక ధరకు ఎరువుల విక్రయాలు కొనసాగుతున్నాయి.



యూరియా



డీఏపీ

ఎరువు	డిమాండ్ మెట్రిక్ టన్నులు	సరఫరా మెట్రిక్ టన్నులు
యూరియా	1,42,100	42,075
డీఏపీ	62,385	18,605
కాంప్లెక్స్	1,12,990	41,366
ఎంఓపీ	16,210	4,182
ఎస్ఎస్‌పీ	9050	25,891

ఎరువులు దొరకడం లేదు...



మొక్కజొన్నను 15 ఎకరాల్లో సాగుచేసేందుకు సిద్ధమయ్యాను. దుక్కుల్లో వేసేందుకు యూరియా, డీఏపీ అవసరం. ఎరువుల కోసం వ్యాపారుల వద్దకు వెళ్తే ధర ఎక్కువ చెప్తున్నారు. సొసైటీ నుంచి ఎరువులు తెచ్చేందుకు తిరుగుతున్నాం.

–ఇగుటూరి కోటిరెడ్డి, దొండపాడు, నరసరావుపేట మండలం

అధిక ధరకు అమ్ముతున్నారు



వ్యాపారుల వద్ద ఎరువులు ఉన్నా అధిక రేటుకు అమ్ముతున్నారు. గతంలో ఆర్‌బీకేల ద్వారా ఎరువులు, విత్తనాలు సరఫరా చేశారు. ఇప్పుడు కూడా ప్రభుత్వం ఈ కేంద్రాల ద్వారా అందిస్తే రైతులకు మేలు జరుగుతుంది.

–అన్నపురెడ్డి వేణుమాధవరెడ్డి, చాగంటివారిపాలెం, ముప్పాళ్ల మండలం

అందుబాటులో ఎరువులు



జిల్లాలో ప్రస్తుత అవసరాలకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయి. మరో వారం రోజుల్లో వరి నాట్లు కూడా పూర్తవుతాయి. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను విక్రయించాలి.

–మురళి, జిల్లా వ్యవసాయ అధికారి

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి

జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

నకరికల్లు: మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించి విద్యార్థులకు పరిశుభ్రమైన పౌష్టికాహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. మండలంలోని నర్సింగపాడు గ్రామంలోని యూపీ పాఠశాలను శుక్రవారం సందర్శించారు. తాగునీటి ఆర్వో ప్లాంటులో నీటి పరిశుభ్రతను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరీక్షించారు. తరగతి గదులు, పరిసరాలు, రికార్డులు పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యను అందించడంతోపాటు వారి ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత కూడా ఉపాధ్యాయుల పైనే ఉందన్నారు. ఆయన వెంట జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో తనిఖీలు

పీహెచ్‌సీలో మందుల కొరత లేకుండా చూసుకోవాలని, మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సూచించారు. స్పెషల్ ఆఫీసర్ డే సందర్భంగా నకరికల్లులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. వైద్యశాలలోని మందులు, ఆపరేషన్ గదిని తనిఖీ చేసి వసతులు, మందుల నిల్వలు పరిశీలించారు. పరిశుభ్రతను పరిశీలించిన ఆయన వైద్యసిబ్బందికి పలు సూచనలు చేశారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవి, డీఎంఓ రత్నాకర్, డాక్టర్ షేక్.హసీనా తదితరులున్నారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ పి.అరుణ్‌బాబు

రైల్వే ఓవర్ బ్రిడ్జికి రూ.70.49 కోట్లు మంజూరు

కేసానుపల్లిలో తీరనున్న ట్రాఫిక్ కష్టాలు

దాచేపల్లి: దాచేపల్లి–కారంపూడి రోడ్డు మార్గంలోని కేసానుపల్లి గ్రామంలో ఉన్న రైల్వేగేట్ వద్ద ఆర్‌ఓబీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.70.90 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ రోడ్డు మీదుగా దాచేపల్లి నుంచి కారంపూడి, వినుకొండ, బొల్లాపల్లి, ఈపూరు, మార్కాపురం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మార్గంలోనే శ్రీ సిమెంట్స్, చెట్టినాడ్ సిమెంట్స్, చక్ర సిమెంట్స్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ మార్గంలో రోజుకు 40 నుంచి 50కి పైగానే రైళ్లు, గూడ్స్‌లు రాకపోకలు సాగిస్తుంటాయి. రైళ్లు వచ్చే సమయంలో గేటు మూసివేస్తారు. ఒక్కసారి గేట్ మూసివేస్తే 10 నుంచి 15 నిమిషాల తర్వాత ఓపెన్ చేస్తారు. ఒక్కొక్కసారి రెండు రైళ్లు రాకపోకలు సాగించాల్సిన సమయంలో 20 నిమిషాల సమయం కూడా పడుతుంది. వాహనాలు భారీగా నిలిచిపోతాయి. ఈ గేట్ వద్ద ఆర్‌ఓబీ నిర్మించాలని అప్పటి గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ద్వారా నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించారు. తాజాగా నిధులు మంజూరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



కేసానుపల్లి రైల్వేగేట్

మిరప పంట పీకివేత

భారీ వర్షాలకు దెబ్బతిన్న పంట

దాచేపల్లి: భారీ వర్షాలు ఆ రైతుని నట్టేట ముంచాయి. భారీ వర్షం కారణంగా పంటంతా పాడైపోవటంతో రైతు మొక్కలను పీకేశాడు. రైతు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని భట్రుపాలెంకి చెందిన కేశావత్ సైదానాయక్ అనే కౌలు రైతు రెండు ఎకరాలు కౌలుకి తీసుకుని మిరప పంట సాగు చేస్తున్నాడు. ఎకరం రూ.20వేల చొప్పున రెండు ఎకరాలకు రూ.40వేలు కౌలు చెల్లించాడు. రూ.30వేలతో మిరప మొక్కలు కొనుగోలు చేసి మరో రూ.20వేలు కూలీలకు చెల్లించి పంటను సాగు చేశాడు. ఇప్పటి వరకు రూ.50వేలు ఖర్చు చేసి పంటని కాపాడుకోవటం కోసం మందులను పిచికారి చేశాడు. ఇటీవల కాలంలో తరచూ వర్షాలు కురుస్తుండటంతో రెండుసార్లు మొక్కలు పీకేసి మళ్లీ నాటాడు. తాజాగా కురిసిన వర్షాలకు మిరప మొక్కలు బాగా దెబ్బతిన్నాయి. వర్షపునీటిలో నాని పోవటంతోపాటుగా పూత, పిందెలు రాలి ఆకులు ముడతపడ్డాయి. ఎన్ని మందులు పిచికారి చేసినా మొక్కలు ఎదుగుదల లేకుండా ఎండిపోతున్నాయి. తీవ్ర ఆవేదనకు గురై మిరప మొక్కలను పీకేశాడు.



మొక్కలు పీకేస్తున్న రైతు

అనుమతులు రద్దు చేయాలి

- నివాస, ఆధ్యాత్మిక ప్రాంతాల్లో మద్యం దుకాణమా?
- మహిళల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోవాలి
- సత్తెనపల్లిలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఎదుట మహిళల ఆందోళన

సత్తెనపల్లి: సత్తెనపల్లిలోని అచ్చంపేట రోడ్డులో గల కోటమ్మ సత్రం వద్ద నూతన మద్యం దుకాణం అనుమతులు రద్దు చేయాలని శుక్రవారం మహిళలు ఆందోళన చేపట్టారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా దసరా ఉత్సవాల సమయంలో బతుకమ్మను, వినాయక చవితి పర్వదినానికి వినాయక మండపం ఏర్పాటు చేసి తొమ్మిది రోజుల పాటు నిత్య పూజలు నిర్వహించే ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు సరికాదన్నారు. అంతేకాక కోటమ్మ సత్రానికి కూత వేటు దూరంలో కుడివైపున శివాలయం, ఎడమవైపున రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయం, ఎదురు రోడ్డులో గాంధీ చౌక్ వద్ద విఘ్నేశ్వర ఆలయానికి ఇటు వైపు గుండా భక్తులు వెళుతుంటారన్నారు. కోటమ్మ సత్రం వద్ద మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడం వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. . తక్షణమే జిల్లా కలెక్టర్, ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి మద్యం దుకాణం అనుమతులు రద్దు చేయాల న్నారు. కోటమ్మ సత్రం వద్ద నుంచి సత్తెనపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వరకు ఆర్యవైశ్య మహిళలు ప్రదర్శన నిర్వహించారు. సీఐ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం ప్రదర్శనగా డీఎస్పీ కార్యాలయానికి చేరుకుని డీఎస్పీ ఎం.హనుమంతరావుకు వినతిపత్రం అందజేశారు.



సత్తెనపల్లిలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

ఆధ్యాత్మిక ప్రదేశంలో మద్యం దుకాణమా?

కోటమ్మ సత్రం వద్ద మహిళలందరూ కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతుంటాం. ఈ ప్రదేశంలో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే మందుబాబుల ఆగడాలను భరించలేం. ఇలాంటి ప్రదేశంలో మద్యం దుకాణానికి అనుమతులు తక్షణమే రద్దు చేయాలి.

–బాలనాగు వరలక్ష్మి, సత్తెనపల్లి

ఇబ్బందులు తప్పవు

పర్వదినాల సమయంలో మహిళలు ఈ ప్రాంతంలో సామూహిక పూజలు చేపట్టడం ఆనవాయితీ. ఇంతటి రద్దీ ప్రదేశంలో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే మహిళలతో పాటు పాఠశాలలకు వెళ్లే పిల్లలు ఇబ్బందులు పడతారు. తక్షణమే మద్యం దుకాణ అనుమతులు రద్దుపరిచేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలి.

–పెండ్యాల లక్ష్మీమాధవి, సత్తెనపల్లి

ప్రేమజంట ఆత్మహత్య

- కులాంతర వివాహానికి ఒప్పుకోని పెద్దలు
- పెదకాకానిలో రైల్వే ట్రాక్‌పై బలవన్మరణం

పెదకాకాని: పెళ్లికి పెద్దలు అంగీకరించలేదని ఓ ప్రేమజంట శుక్రవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన దానబోయిన సాంబశివరావు దంపతుల చిన్న కుమారుడు మహేష్(22) రెండేళ్లుగా హైదరాబాద్‌లోని ఓ సెల్‌ఫోన్ షోరూంలో పని చేస్తున్నాడు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన నండ్రు వెంకయ్య, విజయ దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు. చిన్న కుమార్తె శైలజ కూడా అదే సెల్‌ఫోన్ షోరూంలో ఉద్యోగంలో చేరింది. మహేష్, శైలజల మధ్య పరిచయం కాస్త ప్రేమగా మారింది. వారి కులాలు వేరు కావడంతో పెళ్లికి పెద్దలు అంగీకరించలేదు. కొంతకాలం కిందట హైదరాబాద్ నుంచి శైలజ తిరిగొచ్చి గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో రిసెప్షనిస్ట్‌గా పనిచేస్తోంది. ఇదిలా ఉండగా, ఈ నెల 10వ తేదీన ఆస్పత్రికి వెళ్లిన శైలజ ఫోన్ స్విచ్చాఫ్ అయింది. వారం కిందట నందిగామ పోలీసులకు తల్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేశారు. వారం కిందట ఇంటి నుంచి కొంత నగదుతో బయటకెళ్లిన మహేష్ తిరిగి రాలేదు. శుక్రవారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో ఇద్దరూ బైక్‌పై పెదకాకాని భ్రమరాంబపురం ఆర్చి సమీపంలో రైల్వే ట్రాక్ వద్దకు చేరుకున్నారు. బైక్, వారి వద్ద ఉన్న బ్యాగ్‌లు అక్కడే పెట్టి ఇద్దరూ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికుల సమాచారం మేరకు మహేష్ కుటుంబ సభ్యులు, బంధువులు అక్కడికి చేరుకున్నారు. ఘటనా స్థలాన్ని రైల్వే సీఐ అంజిబాబు, ఎస్‌ఐ రమేష్‌లు పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.





మహేష్, శైలజ (ఫైల్)

క్లుప్తంగా

రైల్వే ఆన్‌లైన్ టికెట్ల కోసం ప్రత్యేక యాప్



మాచర్ల: రైల్వే శాఖ సాంకేతిక టెక్నాలజీ ఉపయోగించి సేవలందిస్తున్నట్లు డీసీఎం ఎం.కమలాకర్‌బాబు తెలిపారు. మాచర్ల రైల్వే స్టేషన్‌ను శుక్రవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ పరిధిలో దక్షిణమధ్య రైల్వే ప్రత్యేక చర్యలు చేపట్టిందని చెప్పారు. ఆన్‌లైన్‌లో బుకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొబైల్ ఫోన్‌లో యాప్ డౌన్‌లోడు చేసుకొని ఏవిధంగా ఉపయోగించుకోవాలో వివరించారు. ప్రతి రైల్వే స్టేషన్‌లో ఆన్‌లైన్ యాప్ గురించి అవగాహన కల్పించేందుకు స్టేషన్‌లను సందర్శించడం జరుగుతోందన్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

చిలకలూరిపేట: నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగుల కోసం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. పట్టణంలోని ప్రత్తిపాటి గార్డెన్స్‌లో శనివారం ఉదయం 9గంటలకు జాబ్ మేళా ప్రారంభమవుతుందన్నారు. పదో తరగతి నుంచి ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ చేసిన ఎవరైనా జాబ్‌మేళాలో పాల్గొనవచ్చున్నారు. దాదాపు 30 కంపెనీల ప్రతినిధులు జాబ్‌మేళాకు హాజరై ఉద్యోగాలకు ఎంపిక చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పిడుగుపాటుతో వ్యక్తి మృతి

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ మండలంలో పిడుగుపాటుతో వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని దొండపాడుకి చెందిన రైతు పి.కొండయ్య(51) జీవాలను మేతకు తీసుకువెళ్లిన సమయంలో ఒక్కసారిగా పిడుగుపడి మృతిచెందాడు. ఈ ఘటనను గమనించిన స్థానికులు వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు వచ్చి గమనించగా అతను అప్పటికే మృతి చెందాడు.

సాక్షి స్పెల్‌బీకి విశేష స్పందన

- ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు
- పట్టు సాధించేందుకు అవకాశం
- మరిన్ని పోటీలకు హాజరువుతామంటున్న విద్యార్థులు



స్పెల్‌బీ పోటీకి హాజరైన విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: పాఠశాల స్థాయి విద్యార్థులలో ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంపొందించేందుకు సాక్షి స్పెల్‌బీ పరీక్ష దోహదపడుతోందని లిటిల్ జెమ్స్ స్కూల్ ఇన్‌చార్జి ఎస్.సుష్మ తెలిపారు. సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో శుక్రవారం రెడ్డినగర్‌లోని లిటిల్ జెమ్స్ స్కూల్‌లో నిర్వహించిన స్పెల్‌బీ పరీక్షకు విశేష స్పందన లభించింది. కఠినమైన ఆంగ్ల పదాలకు విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే విధంగా పదాలను పూరించే నైపుణ్యంపై విద్యార్థులు ఆసక్తి చూపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన స్పెల్‌బీ పరీక్షలో 27 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 1, 2 తరగతులు కేటగిరీ-1 విభాగంలో 13మంది, 3,4 తరగతులు కేటగిరీ-2 విభాగంలో 10మంది, 5,6,7 తరగతులు కేటగిరి-3 విభాగంలో 4 విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులలో ధైర్యాన్ని నింపి ఏకాగ్రత ఆలోచన శక్తిని పెంపొందించేందుకు స్పెల్‌బీ వంటి కార్యక్రమాలు దోహదపడతాయని సుష్మ పేర్కొన్నారు. ఆంగ్ల పదాలపై పట్టు సాధించటంతో పాటు ఉచ్ఛరణపై అవగాహన పెరుగుతుందని వివరించారు. విద్యార్థుల భవిష్యత్‌కు ఇటువంటి కార్యక్రమాలు అవసరమని స్పష్టం చేశారు.

విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం



సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెల్‌బీ పరీక్ష విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం. ఇటువంటి పరీక్షలు నిర్వహించటం ద్వారా విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెరుగుతోంది. పాఠశాల విద్య నుంచే పోటీ పరీక్షల్లో పాల్గొనే విధానం అలవడుతుంది.

–ఎస్.సుష్మ, ఇన్‌చార్జి, లిటిల్ జెమ్స్ స్కూల్

స్పెల్‌బీతో ఉత్సాహం



సాక్షి స్పెల్‌బీ ఎంతో ఉపయోగకరం అని పరీక్షకు హాజరైనప్పుడు తెలిసింది. ఇంగ్లిష్ పదాలకు స్పెల్లింగ్ ఎలా రాయాలో తెలియవచ్చింది. ఇంగ్లిష్‌పై పట్టు సాధించేందుకు ఇటువంటి పరీక్షలు అవసరం.

–పి.ఆశ్రిత, 7వ తరగతి

పదాల ఉచ్ఛరణ సులువు



స్కూల్‌లో నేర్చుకుంటున్న పాఠాలతో పాటుగా ఇంగ్లిష్‌లో కొత్త పదాలు, వాటికి అర్థాలతో పాటు వాటి ఉచ్చరణ తెలుసుకున్నా. ఇటువంటి పోటీలు మాకు బాగా ఉపయోగపడతాయి. ఇటువంటి పోటీలలో ఇంకా పాల్గొంటాను.

–ఎం.మోనిక సిరి, 6వ తరగతి

భయం పోయింది..



స్పెల్‌బీ పరీక్షలో పాల్గొనేందుకు ముందుగా భయపడ్డాను. కానీ భయం పోయింది. ఇంగ్లిష్ చాలా సులువుగా అర్థం చేసుకునేందుకు అవకాశం. ఇటువంటి పోటీలు ఇంకా పెట్టాలి.

–గురుచరణ్, 4వ తరగతి

మాచర్లలో 21.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

నరసరావుపేట: అల్పపీడ ప్రభావంతో గడిచిన 24 గంటల వ్యవధిలో జిల్లాలోని మాచర్ల నియోజకవర్గంలో 21.0 మిల్లీ మీటర్ల వర్షం కురిసిందని శుక్రవారం అధికారులు తెలిపారు. జిల్లా మొత్తంపై ఆరు మండలాలు మినహా మిగతా 22 మండలాల్లో వర్షపాతం నమోదైంది. జిల్లా మొత్తం 127.6 మిల్లీ మీటర్ల వర్షం పడగా దుర్గిలో 3.2, రెంటచింతలలో 7.4, గురజాలలో 12.4, దాచేపల్లిలో 5.2, కారెంపూడిలో 7.4, పిడుగురాళ్లలో 9.6, బెల్లంకొండలో 3.8, అచ్చంపేటలో 1.0, రాజుపాలెం 2.8, నకరికల్లు 3.4, బొల్లాపల్లి 1.6, వినుకొండ 2.8, నూజెండ్ల 3.2, శావల్యాపురం 3.8, ఈపూరు 4.6, రొంపిచర్ల 9.0, నరసరావుపేట 3.2 , ముప్పాళ్ల 4.2, నాదెండ్ల 5.4, చిలకలూరిపేట 9.8, యడ్లపాడు 2.8 మిల్లీ మీటర్ల వర్షం నమోదైంది. కాగా, శుక్రవారం నరసరావుపేట నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. కొద్దిసేపు ఎండ, అప్పటికప్పుడు మేఘావృతమై వర్షం పడింది.

లేబర్ బీమా పథకంలో నిజంలేదు

నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వ లేబర్ బీమా పథకమంటూ వాట్సాప్, సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న పోస్టులలో ఎటువంటి నిజం లేదని, కేంద్ర ప్రభుత్వం ఇటువంటి పథకమేదీ ప్రవేశపెట్ట లేదని స్థానిక అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కిలారు విష్ణు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వాస్తవానికి ఇటువంటి పథకాలు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టలేదని, ఏ లేబర్ ఆఫీసర్ చుట్టూ తిరగొద్దని సూచించారు.

మా ఇళ్ల సమీపంలో మద్యం దుకాణాలు వద్దు

డీఆర్వోకు పలు కాలనీవాసుల వినతి



కలెక్టరేట్‌లో డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

నరసరావుపేట: మా ఇళ్ల సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయకుండా చూడాలని చిలకలూరిపేట రోడ్డులోని ఎస్ఎస్ఆర్, ఆర్టీసీ కాలనీ ప్రజలు విన్నవించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో డీఆర్వో కె.వినాయకంకు ఆ ప్రాంత వాసులు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఈ మార్గంలో ఓవర్ బ్రిడ్జి దాటిన తర్వాత ఆర్టీసీ, ఎల్ఎస్ఆర్ కాలనీల్లో సుమారు వంద కుటుంబాలు నివాసం ఉంటున్నాయని చెప్పారు. ఆర్టీసీ కాలనీకి వెళ్లేదారిలో ఆంజనేయస్వామి దేవాలయం ఉందని, ఆ దేవాలయం గోడను ఆనుకొని గత కొంతకాలంగా మద్యంషాపు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. మద్యం దుకాణానికి దేవాలయానికి ఒకటే గోడ హద్దుగా ఉందన్నారు. ఆ మద్యం దుకాణంకు ఎదురుగా ఎస్ఆర్‌కేటీ కాలనీ ఉందని, ఆ కాలనీలో నిత్యం అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటాయన్నారు. నూతన టెండర్లలో మద్యం దుకాణాలు దక్కించుకున్న వారెవరూ మా ఇళ్ల సమీపంలో దుకాణం తెరవకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో పి.కోటేశ్వరి, సి.చెంచులక్ష్మి, షేక్ అస్మ, వి.లక్ష్మిదుర్గ, షేక్ జిలానీ, పునుగుల శ్రీనివాసరావు, వై.భారతి, ఎం.మేరీ ఉన్నారు.

విద్యుత్ శాఖ సీనియర్ అకౌంట్స్ అధికారి బాధ్యతలు స్వీకారం



బాధ్యతలు స్వీకరిస్తున్న సుబ్బారావు

నరసరావుపేట: స్థానిక విద్యుత్ కార్యాలయంలో పల్నాడు జిల్లా సర్కిల్ సీనియర్ అకౌంట్స్ అధికారిగా కె.సుబ్బారావు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. వారికి అకౌంట్స్ ఆఫీసర్ ఫైనాన్స్ పి.వెంకటేశ్వర్లు పుష్ప గుచ్ఛం ఇచ్చి స్వాగతించారు. బాధ్యతలు చేపట్టిన సుబ్బారావు మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకి మెరుగైన సేవలు అందించే విదంగా పనిచేస్తానని పేర్కొన్నారు. ఆయనను అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ సత్తెనపల్లి శ్రీనివాసరావు, గుంటూరు రూరల్, వినుకొండ, నరసరావుపేట, మాచర్ల, పిడుగురాళ్ల ఇన్‌చార్జి ఏఏఓలు చంద్రశేఖర్, డేవిడ్, బి.వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, సందీపుకుమార్, సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

అర్చకుల సమస్యలు పరిష్కారానికి చర్యలు

అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్



జిల్లా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన శేషాచార్యులను అభినందిస్తున్న నాయకులు

మాచర్ల: అర్చకుల సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకునేలా రాష్ట్ర అర్చక సేవా సంఘం కృషి చేస్తోందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారాయణం వేణుగోపాల్ పేర్కొన్నారు. పట్టణంలోని కోదండ రామాలయంలో పల్నాడు జిల్లా నూతన కార్యవర్గ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు అర్చకుల బాధలను గుర్తించి బ్రాహ్మణుల సంక్షేమం కోసం కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంధ్యాల రవి శంకరాచారి మాట్లాడుతూ అందరూ ఐక్యంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు మాట్లాడుతూ రాబోయే రోజుల్లోనూ తాము సహాయ సహకారాలందిస్తామన్నారు. వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమానికి శ్రీనివాసమూర్తి అధ్యక్షత వహించారు. ఎం.రవికుమార్, కృష్ణమాచార్యులు, గోపిచంద్, ఢిల్లీ అయ్యగారు, నందివెలుగుల శేషగిరిరావు, అడిగొప్పల చెన్నకేశవాచార్యులు పాల్గొన్నారు. అనంతరం పల్నాడు జిల్లా అధ్యక్షుడుగా ఎంపికైన చంగోళం శేషాచార్యులును పలువురు సత్కరించి, అభినందనలు తెలిపారు.

పాడి పశువుల సంతతి పెంపునకు కృషి

పశుసంవర్ధక శాఖ జిల్లా జేడీ ఓ.నరసింహారావు



తెనాలి: జిల్లాలో పాడి పశువుల సంతతి పెంపునకు కృషి చేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ జిల్లా జేడీ ఓ.నరసింహారావు తెలిపారు. పశువుల్లో కృత్రిమ గర్భధారణకు ప్రస్తుతం అమల్లో ఉన్న లింగ నిర్ధారణ వీర్యం విధానాన్ని పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. జిల్లాకు 10 వేల డోసులు లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు చెప్పారు. జిల్లా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా శుక్రవారం ఆయన తెనాలి డివిజన్‌ను సందర్శించారు. స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని పశువైద్యశాలను, పెదరావూరులోని డెప్యూటీ డైరెక్టర్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం అక్కడే తనను కలిసిన మీడియాతో మాట్లాడారు. కృత్రిమ గర్భధారణలో గత రెండేళ్లుగా గొప్ప మార్పులు వచ్చాయని గుర్తుచేశారు. లింగ నిర్ధారణ వీర్యంతో 90 శాతం పెయ్యదూడలు పొందే అవకాశం ఉందని తెలిపారు. తద్వారా పాడి పశువుల సంతతి పెరుగుతూ పాల ఉత్పత్తి అధికం కాగలదని చెప్పారు. పశుపోషకులకు ఎంతో ప్రయోజనకరమైన ఈ పథకంలో లింగ నిర్ధారిత వీర్యం ఒక డోసు రూ.1350 కాగా, ప్రభుత్వం రూ. 850 సబ్సిడీ ఇస్తోందని తెలిపారు. రైతులు కేవలం రూ.500 చెల్లిస్తే సరిపోతుందని చెప్పారు. ఒకవేళ పెయ్య దూడ రాకపోతే రైతుకు రూ.500 తిరిగి చెల్లించే అవకాశం కూడా ఉందని వెల్లడించారు.

నట్టల నివారణ మందును తప్పక వేయించాలి

జిల్లాలో ఈనెల 16వ తేదీ నుంచి గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును ఇస్తున్నట్టు డాక్టర్ నరసింహారావు చెప్పారు. జిల్లాలో గొర్రెలు 1.25 లక్షలు, మేకలు 20 వేలు ఉన్నాయని తెలిపారు. వీటిలో అంతర్గత పరాన్నజీవులు పెరుగుతుంటాయనీ, ఫలితంగా వ్యాధులకు గురవడమే కాకుండా వ్యాధినిరోధకశక్తి తగ్గుతుందని చెప్పారు. నివారణకు పశువైద్యశాలల్లో నట్టల నివారణ మందును జీవాలకు ఇప్పించాలని సూచించారు. జిల్లాలో రైతుసేవ కేంద్రాల్లోని 213 పశుసంవర్ధకశాఖ సహాయకులు పశు వైద్యసేవలను అందిస్తున్నారని గుర్తు చేశారు. కృత్రిమ గర్భధారణ సహా ఇతర సేవలకు పశుపోషకులు సహాయకుల సేవలను కూడా వినియోగించుకోవాలనికోరారు. పశువులకు తీవ్రమైన అనారోగ్యం, ప్రమాదాలు సంభవించినపుడు సంచార అంబులెన్స్‌ల సేవలను రైతులు తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. వీటితోపాటు పెదరావూరు కార్యాలయంలోని నిర్ధారణ కేంద్రంలో పశువుల వ్యాధులను నిర్ధారించుకోవచ్చని వివరించారు. సమావేశంలో డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి, ఏడీలు డాక్టర్ జి.నరేంద్ర, డాక్టర్ రమేష్, వెటరనరీ అసిస్టెంట్ సర్జన్లు డాక్టర్ అబ్దుల్ ముజీర్, డాక్టర్ కావ్య పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ శిక్షణ తరగతులు రద్దు చేయాలి

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల ఉపాధ్యాయులకు తలపెట్టిన రెసిడెన్షియల్ తరహా శిక్షణ తరగతులను రద్దు చేయాలని పల్నాడు జిల్లా ఫ్యాప్టో చైర్మన్ బెజ్జం సంపత్‌బాబు, ప్రధాన కార్యదర్శి వి.అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈనెల 21వ తేదీ నుంచి ఆరు రోజుల పాటు 1,2 తరగతుల ఉపాధ్యాయులకు రెసిడెన్షియల్ శిక్షణ తరగతులను సుదూర ప్రాంతాలలో నిర్వహించటం సమంజసం కాదని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే శిక్షణ తరగతుల విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

గర్భిణుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి



గుంటూరు మెడికల్: గర్భిణుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. గర్భిణుల వివరాలు వీలైనంత త్వరగా నమోదు చేయాలని, హైరిస్క్ వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని సూపర్‌వైజర్లకు శుక్రవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రతి నెలా 9న ఆరోగ్య కేంద్రాలలో జరిగే పీఎంఎస్ఎంఎ కార్యక్రమానికి గర్భిణులను వెంట తీసుకొచ్చి వైద్యులతో పరీక్షలు చేయించాలని ఆదేశించారు. హైరిస్క్ గర్భిణులకు ట్యాగ్ చేయాలన్నారు. ప్రసవానికి ముందుగానే బర్త్ ప్లాన్ చేసుకోవడం, రవాణా వసతులను చూసుకోవాలని సూచించారు. రక్తహీనతతో బాధపడే గర్భిణులు ప్రసవ సమయంలో, అవసరాన్ని బట్టి రక్తదానం చేసే బంధువులను సిద్ధపరచుకోవాలని ఆమె సూచించారు. ప్రతి ఒక్క గర్భిణి కనీసం ఒక్కసారైనా ఈ–సంజీవని యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని, వైద్యులు ఇచ్చిన ఆరోగ్య సలహాలు పాటించాలని తెలిపారు. టిఫా స్కాన్‌ను తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని, అభ ఐడీలో నమోదు కావాలని సూచించారు. వర్షాకాలం కనుక దోమల నివారణ చర్యల విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, డాక్టర్ సీహెచ్.రత్న మన్మోహన్, డాక్టర్ అన్నపూర్ణ, ఎస్ఓ పద్మజ పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని యువకుడి మృతి



తాడేపల్లి రూరల్: తాడేపల్లి కృష్ణా కెనాల్ జంక్షన్ పరిధిలోని కృష్ణానది రైల్వే బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని రైలు ఢీకొని యువకుడి మృతిపై గుంటూరు రైల్వే పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. జీఆర్పీ సీఐ జి.అంజిబాబు మాట్లాడుతూ విజయవాడ నుంచి కృష్ణా కెనాల్ వచ్చే రైల్వే లైన్‌లో కృష్ణానది బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని యువకుడి మృతదేహం రైలు పట్టాలపై పడి ఉందని తెలిపారు. ఏ రైలు ఢీకొట్టిందో సమాచారం లేదని, మృతుడి వయస్సు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండొచ్చని చెప్పారు. లేత నీలి రంగు టీషర్టు, బ్లూ కలర్ జీన్స్ ధరించి ఉన్నాడని, కుడి చేతిపై త్రిశూలం పచ్చబొట్టు ఉందని వివరించారు. ఆచూకీ తెలిసిన వారు 9010999939, 9550523485 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య

బల్లికురవ: మద్యానికి బానిసై గడ్డి మందుతాగి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వైద్యానికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. ఈఘటన శుక్రవారం బల్లికురవ మండలంలోని వైదన గ్రామంలో జరిగింది. ఏస్సై బండి శ్రీనివాసరావు వివరాల మేరకు.. గ్రామానికి చెందిన శెట్టి నాగరాజు (35) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసై ఆటో ద్వారా వచ్చే డబ్బులు ఇంట్లో ఇవ్వక పోవడంతో భార్యభర్తల మధ్య మనస్పర్ధలు ఏర్పాడ్డాయి. దీంతో జీవితంపై విరక్తితో ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి నివారణకు వాడే మందుగి అపస్మారక స్థితికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులు గుర్తించి వైద్యం కోసం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. చికిత్స పొందుతూ అక్కడ చనిపోయాడు. మృతునికి భార్య రామాంజమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదుతో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల నిరసన



డీఈఓ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం సమర్పిస్తున్న మున్సిపల్ ఉపాధ్యాయులు

నరసరావుపేట ఈస్ట్: సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట నిర్వహించిన కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పి.ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వాలు ఎన్ని మారుతున్న దశాబ్దాల కాలంగా మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు అందుతున్న వసతులు రావటం లేదని చెప్పారు. దాదాపు 20 ఏళ్లుగా సమస్యలతో సతమతమవుతున్నా ప్రభుత్వాలకు పట్టడం లేదని వాపోయారు. ప్రమోషన్లు, బదిలీలు లేక ఎక్కడవేసిన గొంగలి అక్కడే అన్నట్టుగా మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలలో అర్బన్ ఎంఈఓ పోస్టులను ఏర్పాటు చేసి ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. సబ్జెక్ట్ టీచర్లను నియమించాలని డిమాండ్ చేశారు. జీఓ 117ను రద్దు చేయాలన్నారు. డీఈఓ ఎం.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎం.మోహనరావు, ఎ.భాగేశ్వరీదేవి, కె.తిరుపతిస్వామి, ఉషాశౌరిరాణి, కోటేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అమరావతి రైతుల కౌలు సమస్యలు పరిష్కరిస్తాం

సీఆర్డీఏ అదనపు కమిషనర్ ప్రవీణ్‌చంద్



రైతుల నుంచి సమస్యలు స్వీకరిస్తున్న ప్రవీణ్‌చంద్

తాడికొండ: రాజధాని అమరావతి ప్రాంతంలో రైతుల కౌలు సమస్యలను ఇప్పటికే కొన్ని పరిష్కరించి వారి ఖాతాల్లో నగదు జమచేశామని, మిగిలిన వారి సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని ఏపీ సీఆర్డీఏ అదనపు కమిషనర్ జి. సూర్య సాయి ప్రవీణ్‌చంద్ తెలిపారు. తుళ్లూరు సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం జరిగిన గ్రీవెన్స్‌డేలో రాజధాని రైతులు వారి సమస్యలను అదనపు కమిషనర్‌కు విన్నవించారు.

ఆయన అధిక శాతం అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపారు. మిగిలినవి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సీఐడీ పరిధిలో ఉన్న కొందరి సమస్యలకు కూడా వెంటనే పరిష్కారం చూపుతామని ఆయన హామీ ఇచ్చారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్న గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎం.విశ్వేశ్వరనాయుడు, కె.స్వర్ణ మేరి, బి. సాయి శ్రీనివాస్ నాయక్, జి.భీమారావు, డీసీడీఓ బొర్రా శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

ఇద్దరు పంచాయతీ కార్మికుల మృతి

- గుర్తు తెలియని వాహనం ఢీ..
- తాడికొండ మండలం నిడుముక్కలలో ఘటన



ఘటనా స్థలంలో మృతదేహాలు

తాడికొండ: గుర్తు తెలియని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరు పంచాయతీ కార్మికులు మృతి చెందిన ఘటన తాడికొండ మండలం నిడుముక్కల గ్రామ పరిధిలో శుక్రవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుళ్ళూరులో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న బత్తుల అయ్యప్ప(43), కంతేటి ఏసు(53) ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. నిడుముక్కల శివారు ప్రింటింగ్ ప్రెస్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు ఘటనా స్థలంలోనే ప్రాణాలొదిలారు. రోడ్డుపై మృతదేహాలు పడిఉన్న తీరుచూసి స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. గుర్తు తెలియని లారీ ఢీకొని ఉంటుందని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. ఘటనా స్థలానికి తాడికొండ సీఐ కె. వాసు చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. బాధితుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు సీఐ తెలిపారు.

రాజధాని ఏరియా పారిశుద్ధ్య కార్మిక సంఘం సంతాపం

ప్రమాదంలో మృతి చెందిన తుళ్ళూరు పంచాయతీ కార్మికులు అయ్యప్ప, ఏసులకు రాజధాని ఏరియా పారిశుద్ధ్య కార్మిక సంఘం తీవ్ర సంతాపం తెలియజేసింది. కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు ఎం.రవి, చెరుకూరి సుశీల తదితరులు మాట్లాడుతూ మృతులు ఇద్దరూ పేద కుటుంబాలకు చెందిన వారని, ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు.